మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 17
పేజీలు : 2

ఆదివారం
03.08.2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## కాంగ్రెస్ మాత్రమే మోదీని దింపగలదు

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**టీ మీడియా,ఆగస్టు 2,ఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ తన కుర్చీ వదులుకోవడానికి సిద్ధంగా లేరని విమర్శించారు. 75 ఏళ్ల తర్వాత పదవి వదులుకోవాలని మోహన్ భగవత్ అన్నారని.. కానీ మోదీ మాత్రం తన కుర్చీని ఎందుకు వదులుకోవడం లేదని ప్రశ్నించారు. అద్వానీ, మురళీ మనోహర్‌జోషికి వర్తించిన వయసు మోదీకి వర్తించదా? అని నిలదీశారు. కాంగ్రెస్ మాత్రమే మోదీని కుర్చీ నుంచి దింపగలదని హెచ్చరించారు.మోదీని ఓడిస్తాం, దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుతామని ఉద్ఘాటించారు.ఢిల్లీలో సీఎం రేవత్‌రెడ్డి పర్యటిస్తున్నారు. శనివారం ఢిల్లీ వేదికగా మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.బ్రిటిష్ పాలకులను తరిమికొట్టిన పార్టీ కాంగ్రెస్ అని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. దేశానికి రాజ్యాంగాన్ని ఇచ్చింది కాంగ్రెస్ అని నొక్కిచెప్పారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న పార్టీ కాంగ్రెస్ అని అభివర్ణించారు. బీజేపీతో సహా అన్ని పార్టీలు అధికారంలో లేకపోతే ఇంటికే పరిమితమని విమర్శించారు. అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్‌ది ప్రజాపక్షమేనని ఉద్ఘాటించారు. పాకిస్థాన్‌పై యుద్ధం చేసి తూర్పు పాకిస్థాన్‌ని విడదీసింది కాంగ్రెస్ అని గుర్తుచేశారు. పాకిస్థాన్‌ను ఇందిరాగాంధీ ముక్కలు చేశారని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి.దేశం కోసం తన ప్రాణాన్ని కూడా ఇందిరా త్యాగం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. ప్రధాని పదవిని త్యాగం చేసిన ఘనత సోనియాదని ప్రశంసించారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలనుకుంటే ఎప్పుడో అయ్యేవారని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా తెలంగాణ మోడల్ అమలు చేసి చూపిస్తామని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశామని తెలిపారు. రాహుల్‌ను ప్రధానిని చేసేవరకు కాంగ్రెస్ శ్రేణులు కలిసి పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## సృష్టి కేసులో...

# మరో ముగ్గురు అరెస్ట్






### తెలుగు రాష్ట్రాల్లోమహిళలే ఏజెంట్లు
### సొంత వెబ్‌సైట్ లో కిలక సమాచారం




**టీ మీడియా,ఆగస్టు 2,హైదరాబాద్:**
సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో తాజాగా శనివారంముగ్గురు అరెస్ట్ అయ్యారు. అరెస్ట్ అయిన వారిలో మహిళలు కూడా ఉన్నారు. ఇప్పటివరకు అరెస్టైన నిందితుల సంఖ్య 11కు చేరింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో డాక్టర్ నమ్రతకు మహిళలే ఏజెంట్లుగా ఉన్నారని హైదరాబాద్ పోలీసులు తెలిపారు. శిశువుల క్రయ విక్రయాల్లో నమ్రతకు ఏజెంట్లు సహకరించారని చెప్పారు. ఏజెంట్లకు డాక్టర్ నమ్రత భారీగా నజరానాలు ఇచ్చారని హైదరాబాద్ పోలీసులు వెల్లడించారు. ఇవాళ (శనివారం) సృష్టి కేసుకు సంబంధించిన కీలక విషయాలను మీడియాకు హైదరాబాద్ పోలీసులు తెలిపారు.

**భారీ నెట్‌వర్క్..**

తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే కాకుండా మరో నాలుగు రాష్ట్రాల్లో డాక్టర్ నమ్రతకు భారీ నెట్‌వర్క్ ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆయా రాష్ట్రాల్లో కూడా మహిళలే నమ్రతాకు ఏజెంట్లుగా ఉన్నారని వివరించారు. జిల్లాలో ఐ వి ఎఫ్ కోసం ఫ్రీ క్యాంపుల నిర్వహించారని అన్నారు. క్యాంపులకు వచ్చిన దంపతులకు ఐ వి ఎఫ్ ద్వారా పిల్లలు కలుగుతారంటూ డాక్టర్ నమ్రత నమ్మబలికారని తెలిపారు. అనంతరం తన వద్దకు వచ్చిన దంపతులను ఐవీఎఫ్ బదులు సరోగసీకి రెఫర్ చేశారని చెప్పారు. సరోగసీ కోసం దంపతుల నుంచి రూ. 30 నుంచి రూ. 50 లక్షలు వసూలు చేశారని వెల్లడించారు. పిల్లలను కొనుగోలు చేసి సరోగసీ ద్వారా పుట్టారంటూ దంపతులకు అప్పగించి డాక్టర్ నమ్రత మోసం చేశారని హైదరాబాద్ పోలీసులు తెలిపారు.

**గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు..**

మరోవైపు... సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో సంచలన నిజాలు వెలుగు చూస్తున్నాయి. డాక్టర్ నమ్రతా కస్టడీ విచారణలో అక్రమాలు బయటపడుతున్నాయి. సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపుల నిర్వహించినట్లు హైదరాబాద్ పోలీసుల దర్యాప్తులో తేలింది. పేదింటి ఆడబిడ్డలకు ఉచితంగా ఫెర్టిలిటీ సేవలు చేస్తానని క్యాంపుల నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. ఏపీలోని పలు జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాలే టార్గెట్‌గా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. మెడికల్ క్యాంపులు నిర్వహించి పేద మహిళలను డాక్టర్ నమ్రత గుర్తించినట్లు హైదరాబాద్ పోలీసులు తెలిపారు.పేద మహిళల ఆర్థిక అవసరాలను గుర్తించి డాక్టర్ నమ్రతాకి సంబంధించిన ఏజెంట్స్ ట్రాప్‌లో పెడుతున్నారని హైదరాబాద్ పోలీసులు వెల్లడించారు.

**ఆ కేంద్రాల్లో డెలివరీలు..**

ఆర్థికంగా ఆశచూపి పిల్లలను కన్నా తర్వాత డబ్బులు ఇస్తామని ఎరా వేసిందని... ఆ తర్వాత ప్లాన్ ప్రకారం డెలివరీ సమయానికి దగ్గరుండి విశాఖపట్నం, విజయవాడ కేంద్రంగా డాక్టర్ నమ్రతా డెలివరీలు చేసిందని తెలిపారు. డెలివరీ అయిన తర్వాత నవజాత శిశువును తీసుకోని, తల్లికి డబ్బులు ఇస్తున్నారు డాక్టర్ నమ్రత బృందం. అలా నవజాత శిశువులను తీసుకొచ్చి చైల్డ్ ట్రాఫికింగ్‌కి పాల్పడుతున్నారు డాక్టర్ నమ్రత బ్యాచ్. సరోగసీ ద్వారా అద్దె గర్భంలో పుట్టిందంటూ బాధిత దంపతులకు ఇస్తున్నట్లు హైదరాబాద్ పోలీసులు గుర్తించారు.

**చైల్డ్ ట్రాఫికింగ్...**

అక్రమంగా సంపాదించిన డబ్బులతో హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఫామ్‌హౌస్, భవన సముదాయాలు కొనుగోలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మియాపూర్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, యూసఫ్‌గూడతో పాటు చాలా ప్రాంతాల్లో భవన సముదాయాలు ఉన్నాయని హైదరాబాద్ పోలీసులు తెలిపారు. సృష్టి సెంటర్ కేసులో కల్యాణి, సంతోషిలా విచారణ కీలకంగా మారనుంది. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఏజెంట్స్ ద్వారా చైల్డ్ ట్రాఫికింగ్‌కి డాక్టర్ నమ్రత పాల్పడ్డారు. కల్యాణి, సంతోషిలే దగ్గరుండి నవజాత శిశువులను తీసుకు రావడంలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణలో డాక్టర్ నమ్రత అక్రమాలు వరుసగా బయటపడుతున్నాయి. ఈ విచారణలో డాక్టర్ నమ్రత ఇంతవరకు నోరు మెదపలేదు. నమ్రతా బాటలోనేకల్యాణి, సంతోషిలు ఉన్నారని హైదరాబాద్ పోలీసులు తెలిపారు.

**అమే గురించి అమే వెబ్‌సైట్ లో**

డాక్టర్
నమ్రత, ఎం.బి.బి.ఎస్., ఎం.డి. ప్రసూతి , గైనకాలజీ హైదరాబాద్‌లో బహుముఖ ప్రజ్ఞాశాలిణి. ప్రస్తుతం, ఆమె యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో సంతానోత్పత్తి వైద్యురాలిగా పనిచేస్తున్నారు. ఆమెకు గైనకాలజిస్ట్ మరియు సంతానోత్పత్తి వైద్యురాలిగా 30 సంవత్సరాల అపారమైన అనుభవం ఉంది.

ఆమె చిన్నతనం నుండే వైద్య రంగం పట్ల మక్కువ పెంచుకుంది. ఆమె అంకితభావంతో, ఆమె 1995లో ప్రతిష్టాత్మక ఆంధ్రా మెడికల్ కాలేజీ, విశాఖపట్నంలో ఉచిత మెడికల్ సీటును గెలుచుకుంది మరియు ఆమె ఎంబిబిఎస్ పూర్తి చేసింది. ఆమె ఆసక్తి ఆమెను జె జె ఎం మెడికల్ కాలేజీ కర్ణాటకలో ప్రసూతి మరియు గైనకాలజీలో ఎమ్ డి పూర్తి చేయడానికి దారితీసింది.ఆమె మక్కువ ఎప్పటికీ అంతం కాలేదు, ఆమె బెంగళూరు మరియు ముంబైలలో సంతానోత్పత్తి వైద్యంలో శిక్షణను పూర్తి చేసింది. ఆమె సింగపూర్ జర్మనీ మరియు ఎడిన్‌బర్గ్ పునరుత్పత్తి కేంద్రాలలో స్పెషలిస్ట్‌గా కూడా శిక్షణ పొందింది హైదరాబాద్‌లో ఉత్తమ సంతానోత్పత్తి వైద్యురాలిగా మారింది. ఆమె బాగా శిక్షణ పొందింది మరియు లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలను అసాధారణంగా బాగా చేస్తుంది.ఆమె 30 సంవత్సరాల అనుభవంతో, వైద్య చరిత్రను మూల్యాంకనం చేయడం ద్వారా మరియు అవసరమైన జంటల మాట వినడం ద్వారా వంధ్యత్వ సమస్యలను నిర్ధారించడంలో నిపుణురాలుగా మారింది. ఆమె రోగి-స్నేహపూర్వక వైద్యురాలు మరియు సంతానం లేని జంటలు మరియు వారి బంధువులకు సమస్యల గురించి వివరణాత్మక వివరణ ఇవ్వడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తుంది, తద్వారా వారు చేయించుకునే సరైన చికిత్సా ఎంపికను ఆమె అన్వేషించవచ్చు.ఆరోగ్యకరమైన గర్భధారణ మరియు ఆరోగ్యకరమైన బిడ్డను అందించడానికి ఆమె ఇజెనోమిక్స్ స్పెయిన్‌లోని వినూత్నమైన అధునాతన రోగనిర్ధారణ పరీక్షలలో ఒకటైనప్రీ జెనెటిక్ స్క్రీనింగ్ శిక్షణ తీసుకుంది. యూనివర్సల్ శ్రుష్టి %ూ+ూ% సెంటర్ ఇప్పుడు హైదరాబాద్‌లోని ఉత్తమ క్లినిక్‌లలో ఒకటి,లో చాలా మంచి విజయ రేటు , ఐ సి ఎస్ ఐముందు క్రోమోజోమల్ సమస్యలను నిర్ధారిస్తుంది.ఆమె మొత్తం వైద్య జీవితంలో, ఆమె వేలాదిజంటలు కుటుంబం కలిగి ఉండాలనే వారి కలనునెరవేర్చుకోవడానికి సహాయం చేసింది.

## ప్రధానమంత్రి కిసాన్ నిధులు విడుదల

### 20,500 కోట్లను రైతుల ఖాతాల్లోకి



**టీ మీడియా,ఆగస్టు 2,ఢిల్లీ బ్యూరో:** అన్నదాతలకు పెట్టుబడి సహాయం అందించే ఆశయంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిషన్ నిధులు శనివారం విడుదలయ్యాయి, ఈ పథకం కింద 20వ విడత నిధులను ప్రధాని మోడీ, ఉత్తరప్రదేశ్లోని వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో కిసాన్ సమ్మన్ నిధి కింద ఈ నిధులు విడుదల చేశారు మొత్తం రూ. 20,500 కోట్లను రైతుల ఖాతాల్లోకి జమచేశారు. దీని ద్వారా మొత్తం 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. కాగా, ప్రధాన్‌మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా 19వ విడత నిధులను ప్రధాని మోదీ ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేసిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా 9.8 కోట్లమంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.22 వేల కోట్లకుపైగా నిధులను జమచేశారు. బీహార్‌లోని భాగల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నిధులను విడుదల చేశారు. రైతులకు పంట పెట్టుబడి సాయం కోసం మోదీ సర్కార్ ఈ స్కీమ్‌ను తీసుకొచ్చింది. ఈ పథకం కింద రైతులకు ఏటా ఒక్కోవిడత రూ.2వేల చొప్పున మూడు విడతల్లో రూ.6వేల సాయం అందనుంది. ఇప్పటివరకు 11 కోట్ల మంది రైతులకు 19 వాయిదాల్లో రూ.3.46 లక్షల కోట్లు అందజేసింది.

## అన్నదాత సుఖీభవ

### పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**టీ మీడియా,ఆగస్టు 2, ప్రకాశం :** అన్నదాత సుఖీభవ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెంలో శనివారం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ పథకంకు సంబంధించిన మొదటి విడత నిధులను విడుదల చేశారు. రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ వారణాసిలో పీఎం కిషాన్ పథకంకు సంబంధించిన నిధులను విడుదల చేశారు. ఈ పథకం కింద ఒక్కో రైతుకు రూ.2వేలు జమ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఏపీలోని ఒక్కో రైతుకు రూ.7వేలు జమ చేశాయి.



**ఏడాదికి మూడు విడుతల్లో..**

అన్నదాత సుఖీభవ పథకం కింద ఏపీ ప్రభుత్వం ప్రతీయేటా రైతులకు రూ.14వేలు ఆర్థిక సహాయం అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిషాన్ పథకం కింద ప్రతీయేటా రూ.6వేలు ఆర్థిక సహాయం అందజేస్తుంది. ఏపీ రైతులకు రెండు పథకాలకు కలిపి రూ.20వేలు ప్రతీయేటా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి. ఈ నిధులు మూడు విడుతల్లో జమ అవుతాయి. మొదటి విడతకు సంబంధించి పీఎం కిసాన్ పథకం కింద రూ.2వేలు, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5వేలు మొత్తం రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి. ఇందుకు సంబంధించిన నిధులను తాజాగా.. వారణాసిలో ప్రధాని నరేంద్ర మోదీ, ప్రకాశం జిల్లా దర్శిలో సీఎం చంద్రబాబు విడుదల చేశారు.

**'అన్నదాత సుఖీభవ' నిధులు రాకుంటే**

అన్నదాత సుఖీభవం పథకం కింద ప్రభుత్వం అందిస్తోన్న లబ్ధిదారుల జాబితాలో ఎవరైనా రైతుల పేర్లు లేకున్నా, వారి ఖాతాల్లో డబ్బులు జమ కాకపోయినా గ్రామాల్లో అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని అధికారులు సూచిచారు. సొమ్మురాని రైతులకు నెల రోజుల పాటు గ్రీవెన్సుకు అవకాశం కల్పించారు. రైతుల పేర్లలో తప్పులు దొర్లినా, ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్ల అనుసంధానంలో పొరపాట్లు చోటుచేసుకున్నా సొమ్ము జమ కాదు. ఇటువంటి రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే ఆయా తప్పులు సరిచేసి సొమ్ము మంజూరయ్యేలా చూస్తారు. ఈనెల 2వ తేదీ నుంచి నెల రోజుల వరకు గ్రీవెన్సుకు అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

## తిని పోవడానికి రాలేదు'

### ఎంపీ మల్లు రవి ఫైర్



**టీ మీడియా,ఆగస్టు 2,కొల్లాపూర్:** ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటనలో నాగర్ కర్నూలు పార్లమెంటు సభ్యులు మల్లు రవి విరుచుకుపడ్డారు. శనివారం కొల్లాపూర్ నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనులకు భట్టి విక్రమార్క రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపనలు చేశారు.అనంతరం జరిగిన బహిరంగ సభలో పార్లమెంటు సభ్యులు మల్లు రవి దాదాపు అరగంటసేపు మాట్లాడారు. ఆయన లో సీఎం రేవంత్ రెడ్డి తో పాటు , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కుడుచేసిన అభివృద్ధి పనులను వివరించాడు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేస్తున్నా మహిళల తరఫున భట్టి విక్రమార్క ఆర్టీసీ సంస్థకు రూ. 6, 600 కోట్లను చెల్లించారని, 200 యూనిట్లు వాడుతున్న ప్రజల తరఫున కరెంటు బిల్లులను సైతం చెల్లిస్తున్నాడని పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గంలో 50 లైబ్రరీల నిర్మాణం కోసం కోటి రూపాయలు శాంక్షన్ చేయడం తో పాటు మరికొన్నింటికి నిధులు మంజూరు చేశారని వివరించారు. ఈ దశలో మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరుడు పెద్దకొత్తపల్లి కాంగ్రెస్ మండల నాయకుడు దండు నరసింహ స్లిప్పుపై స్పీచ్ ముగించాలని మల్లు రవికి ఇవ్వడంతో ఆ నాయకుడిపై కోపోద్రేకుడైయ్యారు. తాను చాపల కూర, చికెన్ కర్రీ తిని పోవడానికి రాలేదని స్థానిక నాయకులపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి బ్యాచ్‌ను తన వద్దకు పంపవద్దని జూపల్లి కృష్ణారావుకు సూచించారు.సదరు మంత్రి జూపల్లి కృష్ణారావు మల్లురవికి సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా తన ప్రసంగాన్ని అడ్డుకోవడం తప్పు, తప్పున్నర అవుతుం దని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో వేదికపై ఉన్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బహిరంగ సభకు హాజరైన ప్రజలు అవాకయ్యారు.

**అభివృద్ధి పనులకు భట్టి శంకుస్థాపనలు**

2లో..

**మంత్రి కొండా సురేఖపై విచారణ**

## బనకచర్ల ప్రాజెక్టుకు మేము వ్యతిరేకం

### ఎంతటి పోరాటానికి అయినా సిద్ధం



**టీ మీడియా,ఆగస్టు 2,హైదరాబాద్:**
పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును తమ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. బనకచర్లపై ఏపీ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యలు సరైనవి కావని తెలిపారు. లోకేష్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. పోలవరం బనకచర్లకు పర్యావరణ అనుమతి లేదని, %+=వీదీ% వ్యతిరేకించిందని గుర్తుచేశారు. ఇవాళ(శనివారం)తెలంగాణ సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిట్ చాట్ చేశారు.తానే స్వయంగా తన లెటర్ హెడ్‌పై కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశానని స్పష్టం చేశారు. బనకచర్లను ఆపేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పుకొచ్చారు. బనకచర్లపై తమ స్టాండ్ క్లియర్‌గా ఉందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని.. గులాబీ నేతలు పబ్లిసిటీ కోసం మాత్రమే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. బీఆర్ఎస్ గాలి మాటలు తప్ప వాస్తవం లేదని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టుకు తాము వ్యతిరేకమని.. ఎంతటి పోరాటానికి అయినా తాము సిద్ధమని ఉద్ఘాటించారు. కేంద్ర బీజేపీతో టీడీపీ పొత్తు ఉందని మంత్రి నారా లోకేష్ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పోలవరం బనకచర్ల ఇల్లీగల్ ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

# అభివృద్ధి పనులకు భట్టి శంకుస్థాపనలు

• పాల్గొన్నమంత్రి జూపల్లి, ఎంపీ

**టీ మీడియా,ఆగస్టు 2,కొల్లాపూర్ :**

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో రూ.65.67 కోట్లతో నిర్మించనున్న 7 విద్యుత్ ఉప కేంద్రాలకు భట్టి, మంత్రి జూపల్లి, ఎంపీ మల్లు రవి శంకుస్థాపన చేశారు. రైతులకు రూ.10 కోట్ల విలువైన విద్యుత్తు సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం 274 మంది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.2.7 కోట్ల విలువైన చెక్కులు, అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలతో పాటు 4,729 మందికి కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజకవర్గంలో శనివారం విస్తృతంగా పర్యటించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజకవర్గంలో శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కనీస వసతులు కల్పించకపోవడంతో అధికారులు సిబ్బంది అనేక ఇబ్బందులు పడ్డారు. ఉదయమే గ్రామాలకు చేరుకున్న అధికారులు, సిబ్బందికి టిఫిన్, మధ్యాహ్నం భోజనాలు ఏర్పాట్లు చేయకపోవడంతో వారంతా హోటళ్ల వద్ద పడిగాపులు కాయవలసి వచ్చింది. కొల్లాపూర్ పట్టణంలో వర్చువల్ లో పాన్గల్ లో 220/132 కేవీ సబ్ స్టేషన్ , జమ్మాపూర్, మైలారం, వెన్నచర్ల, మద్రికల్, మచ్చుపల్లి, పస్పులలో 33/11కేవీ సబ్ స్టేషన్లను ప్రారంభం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ మెటీరియల్ పంపిణీ, లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ , కొత్త రేషన్ కార్డుల పంపిణీ, బహిరంగ సభ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగస్తులు కొల్లాపూర్ పట్టణానికి వచ్చారు.



# ఆశ పెట్టి.. ఆచూకీ లేకుండా పోయాడు

• తిరుమల ట్రేడర్స్ ఘరానా మోసం

**టీ మీడియా,ఆగస్టు 2, ఆర్మూర్ :**

జిల్లా కేంద్రంలో ఘరానా మోసం వెలుగు చూసింది. ముందస్తు ఆర్డర్స్? ఇచ్చిన వారికి 40 శాతం డిస్కౌంట్ అంటూ అడ్వాన్స్ వసూలు చేసి బోర్డు తిప్పేసారు ఓ ట్రేడర్స్ షాపు యజమాని. నిజాంసాగర్? మెయిన్ రోడ్డు పక్కన నూతనంగా తిరుమల ట్రేడర్స్ అనే షాపు ఏర్పాటైంది. కొత్తగా పెట్టిన షాపు కావడంతో యజమాని లేనిపోని మాయమాటలు చెప్తూ.. విస్తృత స్థాయిలో ప్రచారం చేశారు. ఫర్నిచర్, ఫ్రిజ్, వాషింగ్ మిషన్? వంటి వాటికి 40 శాతం డిస్కౌంట్? ఆఫర్ అంటూ నమ్మబలికాడు. దీంతో యజమాని మాటలకు మోసం పోయిన అనేకమంది ముందస్తుగా డబ్బులు చెల్లించి అర్డర్ చేసుకున్నారు.కాగా, కొన్ని రోజులకు ట్రేడర్స్ వారు స్టాక్ డెలివరీ చేస్తామన్న తేదీ దగ్గర పడింది. అయిన ఆర్డర్ ఇంటికి రాకపోవడంతో షాప్ యజమానికి ఫోన్ చేశారు బాధితులు. ఫోన్ స్విచ్ఆఫ్ రావడంతో బాధితులు షాపు దగ్గరకు పరుగులు తీశారు. తీర షాపు దగ్గరకు వెళ్లీ చూడగా.. షాపు క్లోజ్ ఉండటం చూసి తలలు పట్టుకున్నారు. వారం రోజులు గడిచిన షాపు తీయకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు జిల్లా పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.




# న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

• మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**టీ మీడియా ఆగష్టు 2:ధర్మపురి :**

ధర్మపురి మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం బార్ అసోసియేషన్ న్యాయవాదులు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలసి, ధర్మపురి లో ని కోర్టు అభివృద్ధి కోసం కృషి చేయాలనీ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా,ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. త్వరలోనే నూతన కోర్టు భవనం కోసం తప్పకుండ సహకరిస్తానని, అలాగే న్యాయవాదుల సమస్యలను కూడా పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలోధర్మపురిబార్ అసోసియేషన్ అధ్యక్షులు అలుక వినోద్ కుమార్,ప్రధాన కార్యదర్శి మామిడాల శ్రీకాంత్ కుమార్ , ఏ.జీ.పీ.ఇమ్మడి శ్రీనివాస్,న్యాయవాదులు రౌతు రాజేష్, బందెల రమేష్,గూడ జితేందర్ రెడ్డి, జాజాల రమేష్, అప్పల నిరంజన్, కస్తూరి శరత్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికీసంక్షేమ పథకాలు

• మంత్రి లక్ష్మణ్ కుమార్

**టీ మీడియా ఆగష్టు2 , వెల్గటూర్ :**

ఉమ్మడి మండలంలోని హార్హులైనా వారికీ సంక్షేమ పథకాలు అందించిన, మంత్రి.శనివారం వెల్గటూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనారిటీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొన్నారు. వెల్గటూర్ మండలంలో 883 కొత్త రేషన్ కార్డులు, ఎండపెల్లి మండలానికి 686 కొత్త తెల్ల రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమలో భాగంగా 37 లక్షల రూపాయలు విలువ గల 37 కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులను,15,25,500 రూపాయల విలువ గల, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను అందజేస్తున్నదని,సన్న బియ్యం,రేషన్ కార్డులు, ఇందిరమ్మఇండ్లు,మహిళలకు మహాలక్ష్మి పథకం అందించి ఉచిత బస్ ప్రయాణసౌకర్యంకల్పించి,మహిళలను కోటీశ్వరులు చేయాలన్న ప్రభుత్వ దృడ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లడానికిఎన్నోకార్యక్రమాలు,అభివృద్ధిపనులుచేపడుతున్నద ని, రేషన్ కార్డులలో పేర్లు నమోదు కాని వారునమోదు చేయించుకోవాలని ,రేషన్ కార్డుల ప్రక్రియనిరంతరం కొనసాగుతుందని,గత ప్రభుత్వ హయాం నుండి ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల కల ఈ రోజు నెరవేరిందని,రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, వీటన్నిటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని,రేషన్ కార్డులు రానివారు దరఖాస్తు చేసుకోవచ్చుని, ప్రభుత్వం వెంటనే వారి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని కొత్త కార్డు రాని వారుఇబ్బందులుపడాల్సిన పని లేదని,రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని,మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే వీలు ఉంటుందని, ప్రజాపాలనలోనూ ధరఖాస్తులు స్వీకరిస్తారని, అర్హత వున్నవారికి కార్డును వెంటనే మంజూరు చేస్తారనీ,కుటుంబ సభ్యుల పేర్లు జోడింపు ప్రక్రియ కూడా వేగవంతం చేయడంజరిగిందని,అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులను మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శైలందర్ రెడ్డి,కోటిలింగాల గుడి చైర్మెన్ పుదారిరమేష్,మార్కెట్ కమిటీ చైర్మెన్ గోపిక,సందీప్ రెడ్డి,మురళిదర్ గౌడ్,వెల్గటూర్ ఎంఆర్ఓ,ఎండపల్లి ఎంఆర్ఒ, ఆర్ ఐ లు వివిధ శాఖకు సంబంధించిన అధికారులు ప్రజా ప్రతినిధులు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మల్లు భట్టి విక్రమార్కను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**టీ మీడియా ,ఆగస్టు 2 ,పెబ్బేరు :**

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వనపర్తి జిల్లాలోని చిన్నంబావి మండలం వెల్టూరు గ్రామంలో 33/11 కెవి సబ్ స్టేషన్ ప్రారంభోత్సవానికి బయలుదేరిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని శనివారం పెబ్బేరులోని కిష్టారెడ్డిపేట దగ్గర పెబ్బేరు కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేస్ సాగర్, మాజీ సర్పంచ్ సురేంద్ర గౌడ్ రాములు యాదవ్ యుగంధర్ రెడ్డి, రణధీర్ రెడ్డి, దయాకర్ రెడ్డి శివ సాయి, డైరెక్టర్ రాములు మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్ వడ్డే అంజి రజక నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# చట్టాలపై అవగాహన కార్యక్రమం

**ఈ మీడియా ,అక్టోబర్ 2 ,అమరచింత:**

వనపర్తి జిల్లా లోని అమరచింత మండల బాలుర ఉన్నత పాఠశాల లో చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ముఖ్యఅతిథిగా వి.రజని హాజరయ్యి మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు వంటి పదార్థాల కు దూరంగా ఉండాలని డ్రగ్స్ నిరోధక చట్టం పై అవగాహన కల్పించారు, మైనర్ లు లైసెన్స్ లేనిదే వాహనాల ను నడపరాదని మోటార్ వెహికల్ చట్టం గురించి అవగాహన కల్పించడం జరిగింది. లైంగిక వేధింపులకు గాను పోక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమం లో భాగంగా అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరపున న్యాయ సలహాల ను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవలసినది గా కోరారు.కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీదేవి, పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణమ్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.




# 2 లక్షల 30 వేల క్యూసెక్కుల నీరు విడుదల

**టీ మీడియా,ఆగస్టు 2, ఆత్మకూరు :**

వనపర్తి జిల్లా మరిచింత మండలం జూరాల ప్రాజెక్ట్ పెరుగుతున్న భారీ వరద వస్తున్నట్టు ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోని 21 గేట్లు ఎత్తి దిగువకు 2 లక్షల 34 వేల క్యూసెక్కుల నీరు విడుదల విడుదల చేస్తున్నట్టు తెలిపారు. 21 గేట్లు ద్వారా ఓపెన్ చేసి దిగువకు శ్రీశైలము వైపు విడుదల చేసిన అధికారులు, కర్ణాటక నుండి ఇన్ ఫ్లో 2,30,000 క్యూసెక్కులు ఔట్ ఫ్లో 2,34,709 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 318.516 మీటర్లు, ప్రాజెక్టు ప్రస్తుత నీటి సామర్థ్యం 317,550మీటర్లు,ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రాలలో 5 యూనిట్లలో ఉత్పత్తి అవుతుంది, దిగువ జూరాల జల ఉత్పత్తి 6 జరుగుతున్నాయి.



# మహాసభ వాల్ పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే

**టీ మీడియా, ఆగస్టు 2, వనపర్తి బ్యూరో :**

టీఎంజేఎఫ్ రాష్ట్ర రెండో మహాసభ వాల్ పోస్టర్ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రజల సమస్యలను ప్రభుత్వాలు దృష్టికి తీసుకు వెళ్ళేది జర్నలిస్టు లని జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు వాళ్ల పిల్లలకు ఉచిత విద్య హెల్త్ కార్డులు ఇన్సూరెన్స్ మొదలైన అవసరమని ఆయన తెలియజేశారు. అలాగే ఈ నెల 12న హైదరాబాద్ నగరంలోని రవీంద్రభారతలో జరిగే రెండవ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కాటేపాగా హుస్సేన్ మాదిగ తెలిపారు. కావున ప్రతి ఒక్క మాదిగ జర్నలిస్టు ఈ సభకు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం వనపర్తి జిల్లా అధ్యక్షుడు పోతుగంటి చెన్నయ్య, గంధం రవికుమార్, తిమ్మన్న, రాములు, ముప్పూరు కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



# షీ టీమ్స్‌తో భద్రత, భరోసా

**టీ మీడియా,ఆగష్టు 2, రామగుండం క్రైమ్:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలోని గర్మిళ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రత,ఆకతాయిల వేధింపులపై చర్యలు,గుడ్ టచ్-బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరించారు.జిల్లా ఎస్ఐ ఉషారాణి మాట్లాడుతూ, "వేధింపులకు గురైన మహిళలు 6303923700 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 ద్వారా సహాయం పొందాలి" అని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు శ్రవణ్, జ్యోతి, శ్రీలత, హెడ్‌మాస్టర్ కమలాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



# నిరాహార దీక్షను విజయవంతం చేద్దాం

• యునైటెడ్ పూలే ఫ్రంట్

**టీ మీడియా ,అక్టోబర్ 2 వనపర్తిప్రతినిధి:**

తెలంగాణ జాగృతి యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన ఏకైక లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందుకు నడవాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ విజయేంద్ర సాగర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా బహుజన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఎన్నికల వాగ్దానంలో కామారెడ్డి డిక్లరేషన్లు వాగ్దానం చేయడం జరిగింది. ప్రభుత్వం ఏర్పాటు అయిన కాలయాపన చేస్తూ బిసి డిక్లరేషన్ ప్రకటించకపోవడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందిస్తూ ఎన్నికల్లో ప్రకటించిన హామీని వెంటనే అమలు పరచాలని బహుజన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేస్తూ బీసీ సమాజాన్ని చైతన్యపరిచారు 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంగా రైల్ రోకో నిర్వహిస్తామని ప్రకటించడంతో తెలంగాణ ప్రభుత్వం క్యాబినెట్ సమావేశం నిర్వహించి 42 శాతం రిజర్వేషన్ ఆమోదం పొందడం జరిగింది. ఈ ఆర్డినెన్స్ గవర్నర్ కి పంపడం గవర్నర్ న్యాయ సలహాలు తీసుకుంటామని బీసీ ఆర్డినెన్స్ పతులను రాష్ట్రపతి కార్యాలయానికి పంపడం తో వెంటనే 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని తెలంగాణ జాగృతి యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద 72 గంటల నిరాహార దీక్ష తేదీ 4, 5, 6, 7 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని ఈ నిరాహార దీక్షను ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. వనపర్తి జిల్లా నుండి అధిక సంఖ్యలో పాల్గొని ఈ నిరాహార దీక్షను విజయవంతం చేయాలని దీక్షకు సంఘీభావం ప్రకటించాలని అన్నారు ఈ కార్యక్రమంలో యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర నాయకురాలు కే అనిషా శ్రీనివాసులు సాగర్,తెలంగాణ జాగృతి నాయకులు సయ్యద్ కలాం పాషా, వెంకటేష్ విజయ్ ముదిరాజ్, సర్దార్ బేగ్,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలపై అవగాహన

**టి మీడియా ,అక్టోబర్ 2 ,ఆత్మకూరు:**

వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్సై నరేందర్ అపరిచిత వ్యక్తుల నుంచి మీ అకౌంట్ కు సంబంధించి వచ్చే ఫోన్ కాల్స్ ని నమ్మవద్దని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి చెప్పవద్దని, వాట్సప్ గ్రూపులలో వచ్చే ఏపీకే ఫైల్స్ ని డౌన్లోడ్ చేసుకోవద్దు. లాటరీ తగిలిందని అని అంటే నమ్మవద్దని, మీ ఆధార్ కార్డు లేదా మీ క్రెడిట్ కార్డు లేదా మీ బ్యాంక్ అకౌంట్ క్లోజ్ చేస్తున్నామని అప్డేట్ గురించి మిమ్మల్ని ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంప్రదిస్తే నమ్మవద్దు.మీ పేరు పై పార్సిల్ వచ్చింది అని ఎవరైనా మిమ్మల్ని బెదిరింపులకు గురిచేసిన లేదా డబ్బులు పంపమని బెదిరించిన డబ్బులు పంపవద్దని, పోలీసులకు ఫిర్యాదు చేయాలని,మీకు వాట్సాప్ లో వీడియో కాల్ చేసి మేము సైబర్ క్రైమ్ పోలీసులము సైబర్ క్రైమ్ చేశారు మీ పై సైబర్ కేసు నమోదు చేస్తున్నాము అంటే నమ్మవద్దని,నకిలీ అప్ లలో పెట్టుబడులు పెట్టరాదనివాట్సాప్ ల/ టెలిగ్రామ్/ఇన్‌స్టాగ్రామ్/ ఫేస్బుక్ ఇతర యాప్లలో వచ్చే లింకులపై క్లిక్ చేయరాదు.మీకు లోన్లు ఇస్తామని ఎవరైనా కాల్ చేస్తే నమ్మరాదు.ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి కాల్ చేయగలరని ఆత్మకూరు ఎస్ఐ సూచించాడు.ఇట్టి కార్యక్రమంలో ఎస్సై నరేందర్ ఆత్మకూర్, హెడ్ కానిస్టేబుల్ గుప్త, కానిస్టేబుల్ సురేందర్, చంద్రకళ, స్వర్ణలత లు పాల్గొన్నారు.



# రంజిత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు : ఎమ్మెల్సీ

**టీ మీడియా, ఆగస్టు 2, మేడ్చల్:**

చర్చ్ గాగిల్లాపూర్ బీఆర్ఎస్ నాయకులు రంజిత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎమెల్సీ శంభీపూర్ రాజుని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు.



# తెలంగాణలో సరికొత్త స్పోర్ట్స్ పాలసీ

• అవిష్కరణ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**టీ మీడియా ఆగష్టు2 ,హైదరాబాద్ :**

లెటజ్ స్టార్ట్ ది గేమ్ అంటోంది తెలంగాణలో రేవంత్ సర్కార్.. పాత క్రీడావిధానాన్ని సమూలంగా మార్చి.. సరికొత్త స్పోర్ట్స్ పాలసీతో దూసుకెళ్తోంది. హైదరాబాద్ హెచ్ ఐ సిసి వేదికగా జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ ఫస్ట్ ఎడిషన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నూతన క్రీడా విధానం ఆవిష్కృతమైంది. ఒలింపిక్ పతకాలే మన పాలసీ లక్ష్యమని, ఆ విధంగా తెలంగాణ సర్కార్ దేశానికే ఆదర్శంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. యువత క్రీడామైదానాల్లో లేకపోవడంతో దేశం చాలా నష్టపోతోందన్నారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి స్టేడియమ్‌ను ప్రస్తావించారు.ఉద్యమంలో ముందుభాగంలో నిలబడి పోరాడిన యువత.. గత ప్రభుత్వ విధానాలు సరిగా లేకపోవడం వల్ల వ్యసనాల బారిన పడిందని ప్రభుత్వం భావిస్తోంది. యువతీయువకుల్లోని బలమైన పోరాట స్ఫూర్తిని క్రీడల వైపు మళ్లించాలన్నది సర్కార్ ఆలోచన. క్రీడా విధానంలో రాజకీయాల జోక్యాన్ని తగ్గించాలన్న ఉద్దేశంతో పబ్లిక్, ప్రైవేట్ ఉమ్మడి భాగస్వామ్యంతో కొత్త స్పోర్ట్స్ పాలసీని రూపొందించారు. కార్పొరేట్ కంపెనీల్లో సక్సెస్ స్టోరీ ఉన్నవాళ్లు, క్రీడల్లో రాణించి పతకాలు తెచ్చి దేశానికి గర్వకారణంగా నిలబడ్డవాళ్లు పాలసీలో కీలకంగా మారబోతున్నారు.చదువుల్లోనే కాదు, క్రీడల్లో రాణించేవాళ్లకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలబడుతుందని, అజారుద్దీన్, వీవీఎస్ లక్ష్మణ్, రవికాంత్, సిరాజుద్దీన్, నికత్ జరీన్లాంటిస్పోర్ట్స్‌స్టార్లఅనుభవాన్నిఉపయోగించుకుంటామని చెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి. అన్ని రంగాల్లో ప్రపంచంతో పోటీపడుతున్నాం.. క్రీడల విషయంలో మాత్రం ఎందుకు బలహీనంగా ఉన్నాం.. అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలన్నారు. భారత్‌కు బలమైన క్రీడావేదిక కావాలి.. అందులో తెలంగాణ ప్రధానంగా ఉండాలి అని పిలుపునిచ్చారు.




# మంత్రి కొండా సురేఖపై విచారణ

• నాంపల్లి కోర్టు నిర్ణయం

**టీ మీడియా, ఆగస్టు 2, హైదరాబాద్ బ్యూరో :**

మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వేసిన పరువునష్టం దావా కేసును విచారణకు స్వీకరించాలని నాంపల్లి కోర్టు నిర్ణయించింది. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన నేపథ్యంలో ఈ కేసులో విచారణ జరపనున్నట్లు ఇవాళ తెలిపింది. అనంతరం తదపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది.ఫిర్యాదుతో పాటు సాక్ష్యుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్ల పరిశీలించిన తర్వాత ఈ కేసులో విచారణ జరపాలని న్యాయస్థానం నిర్ణయించింది. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్?తో పాటు సమంత విడాకుల వ్యవహారంలో తనపై కొండా సురేఖ నిరాధార ఆరోపణలు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె. తారక రామారావు కోర్టును ఆశ్రయించారు.



# పేద విద్యార్థులకు అండగా

• బుద్ధాస్ లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్

**టీ మీడియా ఆగష్టు2 ,హైదరాబాద్ :**

సమాజ సంక్షేమానికి కట్టుబడిన ప్రపంచ బౌద్ధ సంస్థ.. బుద్ధాస్ లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ (బీఎల్ఐఏ) పేద పిల్లలకు ప్రయోజనం చేకూర్చే స్వచ్ఛంద సేవా కార్యక్రమం ద్వారా.. తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. హైదరాబాద్ కవాడిగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివే 1 నుండి 5 తరగతుల పిల్లలకు 271 జతల బూట్లు, ఇండోర్ స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. పావన అభ్యర్థన మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇండోర్ ఆట వస్తువులను బీఎల్ఐఏ హైదరాబాద్ సభ్యులు విరాళంగా ఇచ్చారు. బూట్లను సింగపూర్ చాప్టర్‌కు చెందిన మేడమ్ మోరిన్ అందించారు. ఈ కార్యక్రమం ప్రపంచ వ్యాప్తంగా భాగస్వామ్య విలువల స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని.. బీఎల్ఐఏ నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. మాస్టర్ సింగ్ యున్ మార్గదర్శకత్వంలో స్థాపించబడిన బీఎల్ఐఏ.. మానవతా బౌద్ధమతాన్ని ప్రతిబింభిస్తుంది. కరుణ, సేవ, విద్య ద్వారా పేద పిల్లల జీవితంలో ఆధ్యాత్మిక అభ్యాసాన్ని అనుసంధానిస్తుంది.సంఘరఖి?త మహాథెరో నాయకత్వంలో, బీఎల్ఐఏ దక్షిణాసియా సలహాదారు చుహ్మాన్ నిరంతర సేవ చేస్తున్నారు. గతంలో మహబూబ్ నగర్, ఖమ్మం, షాద్ నగర్, హైదరాబాద్‌లోని అనేక ప్రభుత్వ పాఠశాలలకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు అవసరమైన విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు.ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా.. బౌద్ధ తత్వశాస్త్రంలో బోధించిన దశ పరమిత (పది పరిపూర్ణతలు) ముఖ్యంగా దాన పరమిత (ఉదారత్వం పరిపూర్ణత)లకు ఇది సజీవ ఉదాహరణ. పాదరక్షలు, ఆటవస్తువులు వంటి ప్రాథమిక అవసరాలను తీర్చడం ద్వారా బీఎల్ఐఏ హైదరాబాద్ పేద పిల్లలకు ఆనందం, ఆశ, గౌరవాన్ని తీసుకురావాలనే లక్ష్యాన్ని కొనసాగిస్తోంది.

